# చెమ్మగిలిన కన్నులు

విశ్వనాథం చెప్పిన విషయం విన్నతరువాత వెంకటేశ్వర్లు మనసు జాలితోనూ, ఆర్ద్రతతోనూ కన్నీరు కార్చింది. ఇవాళ అతను లేచిన వేళ మంచిదగాదు.

పొద్దున మామూలుగానే తెల్లవారింది.

చిటుకేశ్వరపు చెట్టు చలికాలపు లేత యెండలో ఉదయాన తళతళలాడిపోయింది, చూస్తూ యెంతోసేపు గడిపాడు. మనసు యెందుకో అంత అందమైన దృశ్యాన్ని చూస్తున్నా అసంతృప్తిలో మూలిగింది. ఇటువంటి అందమైన ఉదయాలు యెన్ని చూడలేదు? ఏముంది విశేషం? ఎన్ని సాయంకాలాల ఎర్రటికిరణాలు ఊరిబయట పొలాలమీద అందమైన దృశ్యాలు రచించి చీకటులలో కలిసిపోలేదు? రైళ్ళు వస్తున్నాయి. రైళ్ళు పోతున్నాయి. ఎంతోమంది ప్రయాణాలు చేస్తున్నారు. ఒక్కొక్కడు ఒక ఉదయం, ఒక సాయంకాలం అనుభవించి ఒక్కరోజు పెద్దవాడవుతున్నాడు. ఏమిటి తనకీ అసంతృప్తి? ఎందుకింత ఆలోచన. ఏమిటీ ఆవేదన?

ఆలోచనలు లేకుండా యెలా బ్రతకటం?

ఈర్ష్య లేకుండా, ద్వేషం లేకుండా.

నిన్న విశ్వనాథం జెప్పాడు. వాళ్ళ బాబాయి చచ్చిపోయినాడుట. తన మనసు ఎంతో దైన్యంతో నిండిపోయింది. అతనికెలా సానుభూతి చూపాల్సిందీ తెలియలేదు. ఉన్న ఒక్క

ఆధారం పోయింది విశ్వనాథానికి. క్రిందటి సంవత్సరం అతడి అన్న పోయినాడు. అంత క్రితపు ఏడు వాళ్ళింట్లోనే ఇంకోరు పోయినారు. మూడేళ్ళనుంచీ ముగ్గురూ! మనకు తెలీకుండా క్షణానికి యెందరో!

ఇంకాస్త ముందుకి నడిస్తే ఇంకో స్నేహితుడు కన్పించాడు. అతడి తమ్ముడు పోయాడుట క్రిందటి నెలలో, మళ్ళీ చావుకబురు. క్షయరోగుల ఆస్పత్రి ముందునుంచి వస్తుంటే వొక విషాదదృశ్యం. దేవకన్యలాంటి అమ్మాయి రోగంతో ఇంకా కొన్నాళ్ళకు చచ్చిపోయే రూపంలో కన్పించింది. వెంకటేశ్వర్ల కన్నులు చెమ్మగిల్లాయి. ఇంకాస్త నడిచాడు. పార్కు పక్క చింతచెట్టుకింద బిచ్చగాడి కుటుంబం కన్పించింది. వాడికో భార్యా, వో పిల్లా.

వాళ్ళనుదాటి ముందుకు పోయినతర్వాత వెంకటేశ్వర్లకనిపించింది. కొంతలో కొంత వాళ్ళేనయం. వాళ్ళకు కనీస సుఖాల పరిస్థితి కూడా ఉండదు. ఆలోచనలు ఉండవు. మనస్సనే పదార్థం యెంతో జడం వాళ్ళలో. దైహికమైనకష్టాలూ సమస్యలే కాని మనసు ఆలోచించ లేదు. అదే నయం.

ఇంటికి వచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు.

"బ్రతుక్కి ప్రశాంతత యెలా లభించేను? నాకు స్నేహమీ వద్దు. నాకు సంపదలు వద్దు. సుఖాలువద్దు. ఆలోచనలు వద్దు. నన్ను నేను మరచిపోవాలి నాకు పిచ్చియెత్తినా సంతోషిస్తాను." అనుకున్నాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు ?" అన్నది అరుణవచ్చి.

"చావును గురించి."

ఆమె పెదాలు బిగబట్టింది. "ఇప్పు డేమైంది ?"

ఆమె ఒక తమాషావిషయం చెప్పాలనుకొని వచ్చింది.

పక్కింటి వాళ్ళింట్లో అత్తగారూ, కోడలూ కలిసి వో చీర బేరంచేసి యెంతో తక్కువకు కొనుక్కున్నామని సంతోషిస్తున్నారు. పాపం వెర్రిబాగులవాళ్ళు. నిజంగా ఆ చీరను వాళ్ళు యెక్కువ ఖరీదుపెట్టికొన్నారు. ఆ విషయంవర్ణించిచెప్పి నవ్వాలని వచ్చింది అరుణ. అతణ్ణి నవ్వించాలని, కాని ...

"మీకు యేదైనా ఉద్యోగం త్వరగా చూసిపెట్టమని నాన్నగారికి చెప్పుకుంటాను"

"కృతజ్ఞుణ్ణి. మీ ఋణం చర్మాన్ని చెప్పులు కుట్టి యిచ్చినా తీర్చుకోలేను." స్వరంలో వెటకారం.

అరుణ కళ్ళు నీళ్ళతో నిండాయి.

"మీరు ఉద్యోగం చెయ్యరేం ?"

"నాకు సరిపడదుగనుక"

"ఏంచేస్తారు ?"

"ఆలోచన, ఆవేదన"

"ఎందుకు ?"

"నాకు తెలీదు"

"నాతో సరిగా వుండరా ?"

"ఇప్పుడు లేనా ?"

"ఇలా కాదు"

"ఎలా ?"

"నవ్వుతూ, పేలుతూ, కులాసాగా, సంతోషంగా"

"నాచేతకాదు"

"ఏం కష్టమైనపని చెపుతున్నానని. డబ్బువుంది. నేను వున్నాను. మీరున్నారు. నాన్నగారున్నారు."

"ప్రపంచంలో చాలామంది వున్నారు."

"ఎవరిఖర్మ వాళ్ళది"

"నాఖర్మ నాది"

"ప్రపంచంతో మీకేమి ?"

"ఈ ప్రపంచం నాదికాదా"

"ఇంత వైరాగ్య మెందుకు ?"

"నాకు తెలుసునా ?"

"ఏంకావాలి మీకు ?"

"ఏమీ వద్దు"

"నేనుకూడా వద్దా ?"

"ఊహూ"

అరుణ యేడ్చింది. ఆమెకన్నుల్లో యవ్వనం కట్టుకున్న తాజమహాళ్లు యెండకు కరిగినపొగమంచులా చెరిగిపోయినయ్.

"ఏమి టీ మనిషి ?" అనుకున్నది.

ఆమె గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది.

టేబిల్ మీద తల ఆన్చి వెంకటేశ్వర్లు ఆలోచించాడు.

ఇంకా ఆలోచించాడు. ఇంకా, ఇంకా ఆలోచించాడు. ఈమెకు డబ్బువుంది. అందంవుంది. గర్వంవుంది. తనకి ఉద్యోగంలేదు. గట్టిమనస్సు లేదు. దుఃఖం ఎందుకు తెలీదు.

భోజనానికి పిలుపొచ్చింది.

వెంకటేశ్వర్లు వెళ్ళి భోజనంచేశాడు. నిద్రపోయి నాడు. అతడి మనస్సు తేలుతున్నది.

సాయంకాలం వీధిలోకి వచ్చి చూస్తే బస్ స్టాప్ దగ్గర రకరకాల మనుష్యులు. ఇంగా స్నపటికి విచ్చుకునే పువ్వులు, పత్రికలు, అలసటపొందిన ముఖాల్లో ఆనందాలు. ఎందుకు? ఇంటికి పోవటానికేనా ఇంత ఆనందపడతారు వీళ్ళు?

ఇంటికి తిరిగివస్తుంటే వాకిట్లోనే తండ్రిని చూచి ఆఫీసుగుడ్డలేనా విప్పనివ్వకుండా తల్లి దగ్గరనుంచి తండ్రిమీదికి ఉరికే పాప, చిట్టిచిట్టిపావడాలు కట్టుకుని, కన్నుల్లోఅమాయకత్వానికి ఇళ్ళుకట్టి నివశింపచేస్తున్న చిన్నచిన్న పిల్లలు, పువ్వులు, ఆటలు, చప్పట్లు, కేరింతాలు ... దృశ్యాలు.

ఎప్పటి దీ ప్రపంచం?
ఎన్నాళ్ళనుంచీ ఇలాంటి దృశ్యాలు?
ఎందుకు బాధ?
ఏమిటి సంతోషం?

రాత్రి భోజనం చేస్తుంటే, అరుణ యెదురుగా నిలుచుని తనవేపే చూస్తుంటే, ఆమెవేపు చూడలేకపోయాడు అతడు. ఆమెవేపు చూడాలంటే సిగ్గవుతోంది. ఆమె తనని జయించాలనే అలా చూస్తున్నది పువ్వులాగా.

చెయ్యి కడుక్కునేందుకు పెరట్లోకి వెళ్ళితే చంద్రకాంత పూలు వెన్నెట్లో నవ్వుతుంటున్నాయి. వెన్నెల ధారలు ప్రపంచాన్ని అమృతంతో తడిపేస్తున్నాయి. అమృతంతో నింపుతున్నాయి. ఒక్కటే ఒక్క చామంతి పువ్వు

కొమ్మన అందంగా వూగులాడుతోంది. జాజిపూలు పందిరి మీద రహస్యాలు చెప్పుకుంటున్నాయి. వెన్నెల, వెన్నెల, చల్లని వెన్నెల.

ఆమె వచ్చింది.

అతడు చూసినా చూడలేదు.

అతడు చూడలేకపోయినా ఆమె చూసేట్లు చేసింది.

ఆమె నవ్వింది.

ఆమె యెందుకు నవ్విందో అతడికి తెలీదు.

ఆమెకు తెలుసు.

అతడు పురుషుడు. ఆమె ప్రకృతి.

అనాదినుంచీ ఆమెకు తెలుసు.

అతడే తలచుకుని సిగ్గుతో అన్నాడు, "పొద్దుట యేదో విసుగుతో అన్నాను. కోపమొచ్చిందా."

ఆమె నవ్వింది.

ఆమెకు తెలుసు. అత డలా అనకతప్పదని.

అయినా అత డేమైనా అంటే ఆమె కనులు చెమ్మగిల్లుతవి. ఆమె ప్రకృతి.

ఆమె అతడికి దగ్గరైంది.

అత డామెను దగ్గరకు తీసుకున్నాడు.

"ఏమి అనుకోవద్దు. విసుగుతో అలా అన్నాను" అనునయించాడు.

ఆమె కనులు అరమూతలు పడ్డాయి.

చెమ్మగిల్లినకళ్లు వెన్నెలపోసుకుని తడి ఆరిపోయినాయి.